TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 131 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | గురువారం 17 అక్టోబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-




## రైతు సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వం కృషి :

### మంత్రి కోమటిరెడ్డి



**శాసనసభ / హైదరాబాద్ :** రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు.ఎస్ఎల్‌బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ..నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని,ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు.



## హైడ్రా మరింత బలపడింది..

## ఆ బాధ్యత కూడా మాదే: రంగనాథ్

- అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు సంబంధించి హైడ్రానే నోటీసులు ఇస్తుందని వెల్లడి
- జీహెచ్ఎంసీ చట్టసవరణతో హైడ్రాకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చాయన్న రంగనాథ్
- ప్రభుత్వ ఉత్తర్వులతో హైడ్రా మరింత బలపడిందన్న కమిషనర్

మిగతా »»2లో

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీ అధికారాలను హైడ్రా(హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అస్సెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)కి బదలాయించింది.ఆర్డినెన్స్ అధికారాలను హైడ్రాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అక్రమ కట్టడాలపై హైడ్రాకు అధికారాలు ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో జీహెచ్ఎంసీ పరిధి మొత్తంలో అక్రమ కట్టడాలపై కొరడా ఝులిపించేందుకు హైడ్రాకు కల్పించింది. జీహెచ్ఎంసీ చట్టం-1955లో ఇప్పటి వరకు 374, 374-ఎ సెక్షన్లు ఉన్నాయి. ఇప్పుడు సెక్షన్ 374-బి చేరుస్తూ ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరించింది. అందులోని అంశాలకు సంబంధించి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు సమకూరే అధికారాలను రాష్ట్ర ప్రభుత్వం ఏ ఇతర సంస్థకైనా అప్పగించవచ్చని ఆర్డినెన్స్ చెబుతోంది. ఈ ఆర్డినెన్స్ కు అనుగుణంగానే తాజాగా, ఆ అధికారాలను హైడ్రాకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఐఏఎస్ అధికారుల రిలీవ్

### తెలంగాణ నుంచి నలుగురు : ఏపీ నుంచి ఇద్దరు



**శాసనసభ / హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి, రొనాల్డ్ రోస్, వాణి ప్రసాద్, వాకాటి కరుణలను తెలంగాణ ప్రభుత్వం బుధవారం సాయంత్రం రిలీవ్ చేసింది.దీంతో ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మెయిల్ ద్వారా రిపోర్టు చేయనున్నట్లు సమాచారం.కాగా, పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఐఏఎస్ అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే, డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు క్యాట్, హైకోర్టును ఆశ్రయించినా ఊరట దక్కలేదు. ఈ నేపథ్యంలోనే ఏపీకి వెళ్లాల్సిన వాణిప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యారు.ఈ క్రమంలో ఆమ్రపాలి స్థానంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇంఛార్జ్ కమిషనర్‌గా రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌కు, విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ కుమార్ సుల్తానియా, మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శిగా టీకే శ్రీదేవికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.మరోవైపు, ప్రభుత్వ ఆదేశాలతో ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోగా ఆర్ వీ కర్ణన్, ఆయుష్ డైరెక్టర్ గా క్రిస్టినా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## అప్పులు, ఖర్చుల లెక్కలపై కేటీఆర్‌కు భట్టివిక్రమార్క సమాధానం ఇదీ...!



- రూ.80 వేల కోట్లకు పైగా అప్పులు చేసి ఈ ప్రభుత్వం ఏం చేసిందని కేటీఆర్ ప్రశ్న
- అప్పులు, ఖర్చుల లెక్కలపై ప్రకటన విడుదల చేసిన డిప్యూటీ సీఎం కార్యాలయం
- డిసెంబర్ నుంచి రూ.56 వేల కోట్ల పాత అప్పులు, వడ్డీలు చెల్లించామని వెల్లడి

మిగతా »»2లో

## కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి



**శాసనసభ / హైదరాబాద్ :** ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ నినాదంతో ముందుకెళ్తున్నామన్నారు.ఏపీ కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. "ఒకేసారి ఆరు కొత్త పాలసీలు తీసుకొచ్చాం. ఎలక్ట్రానిక్స్, ఇండస్ట్రియల్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ పాలసీలు తీసుకొచ్చాం. పర్యాటక, ఐటీ, వర్చువల్ వర్కింగ్ పాలసీలు తీసుకువస్తాం. 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో వెళ్తున్నాం. ఉద్యోగం చేయడం కాదు.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి. యువత భవిష్యత్తులో పెనుమార్పులు తెస్తాయి" అని సీఎం వివరించారు.

## బీజేపీపై అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు



- జైల్లో ఉన్నప్పుడు ఇన్సులిన్ ఇవ్వకుండా బీజేపీ తనను చంపే కుట్ర పన్నిందన్న కేజ్రీవాల్
- తాను రోజూ నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటానని వెల్లడి
- ఎల్జీని అడ్డుపెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలు ఆపే ప్రయత్నం చేశారని ఆరోపణ

## గుంతలో పడి గాల్లోకి ఎగిరిన కారు ఏడుగురు దుర్మరణం



**శాసనసభ / హైదరాబాద్ :** మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ఏడుగురిని బలితీసుకుంది. జిల్లాలోని శివంపేట మండలం ఉసిరికపల్లి వద్ద రోడ్డుపై ఉన్న గుంత వారి పాలిట మృత్యువుగా మారింది. అతివేగం, రహదారిపై ఉన్న గుంతను గమనించక పోవడంతో కారు అదుపుతప్పి గాల్లోకి లేచింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఏడుగురు అక్కడికక్కడే చనిపోయారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి మాత్రమే గాయాలతో బయటపడ్డాడు.ప్రమాద సమయంలో కారు వేగంగా వెళ్తున్నట్లు తెలుస్తోంది. గుంతలో కారు పడి అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది.దీంతో ఎవరూ ప్రాణాలతో బయట పడే అవకాశం కనిపించలేదు. కారులో ఉన్న 8 మందిలో ఏడుగురు ఊపిరి ఆడక చనిపోయారు. ప్రమాదం గురించి తెలిసిన స్థానికులు కాలువలోకి దూసుకెళ్లిన కారును బయటకు తీసుకొచ్చారు.అప్పటికే ఏడుగురు చనిపోయి ఉన్నారు.

మిగతా »»2లో

## రేవంత్ రెడ్డి పిచ్చోడిలా మాట్లాడుతున్నాడు



- రేవంత్ రెడ్డి ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని ఎద్దేవా
- హైదరాబాద్‌కు మూడు వైపులా సముద్రం ఉందనడం విడ్డూరమని వ్యాఖ్య
- తెలంగాణలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని విమర్శ

**శాసనసభ / హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పిచ్చిపట్టిన వ్యక్తిలా మాట్లాడుతున్నారని, ఆయన మాట్లాడేది ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ...

మిగతా »»2లో

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇదే: హరీశ్ రావు



- ఉన్న పథకాలను బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు అని విమర్శ
- అభివృద్ధి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపాటు
- ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్న హరీశ్ రావు

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు... ఉన్న పథకాలు నిలిపివేయడమేనని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గానికి రూ.5 కోట్లు ఇస్తామని బడ్జెట్‌లో చెప్పిన ప్రభుత్వం... ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. వెంటనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.మహిళలకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తానన్న రేవంత్ రెడ్డి ఒక్కటి కూడా ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు.

మిగతా »»2లో

శాసనసభ
తెలుగు దినపత్రిక

గురువారం 17 అక్టోబర్ - 2024

# నిమ్స్‌లో 10 నెలల్లోనే 101 కిడ్నీ మార్పిడి సర్జరీలు.



శాసనసభ / హైదరాబాద్ : నిమ్స్‌లో 10 నెలల్లోనే 101 కిడ్నీ మార్పిడి సర్జరీలు చేసి మరో ఘనత నిమ్స్ ఖాతాలో చేరింది. ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా సర్జరీలు చేశారు డాక్టర్లు. ఈ నేపథ్యంలో డాక్టర్లు, సిబ్బందిని మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. 10 నెలల్లోనే వందకుపైగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేసిన ప్రభుత్వ దవాఖానగా నిమ్స్ హాస్పిటల్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకూ 101 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు చేశామని నిమ్స్ డైరెక్టర్, డాక్టర్ బీరప్ప బుధవారం ప్రకటించారు. ఇందులో 55 కిడ్నీలను బాధిత పేషెంట్ల కుటుంబ సభ్యులు డొనేట్ చేయగా, ఇంకో 46 కిడ్నీలను బ్రెయిన్ డెత్ కేసుల నుంచి సేకరించి పేషెంట్లకు అమర్చామని ఆయన తెలిపారు. ఇవిగాకుండా 4 లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీలు, ఒక హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జరీ కూడా చేశామని వెల్లడించారు.

( మొదటి పేజీ తరువాయి )

## హైడ్రా మరింత బలపడింది..ఆ బాధ్యత కూడా మాదే

దీంతో హైడ్రాకు జీహెచ్ఎంసీ అధికారాలు కూడా వచ్చినట్లయింది. హైడ్రాకు జీహెచ్ఎంసీ అధికారాలపై రంగనాథ్ ఏమన్నారంటే? ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు జీహెచ్ఎంసీ చట్టంలోని అధికారాలను బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ బుధవారం జారీ చేసిన ఉత్తర్వులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైదరాబాద్ మహా నగరంలో అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు సంబంధించి హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని తెలిపారు. అనధికారిక భవనాల కూల్చివేత అధికారం కూడా హైడ్రాకు లభించిందన్నారు. జీహెచ్ఎంసీ చట్ట సవరణతో హైడ్రాకు పూర్తి స్థాయి అధికారాలు వచ్చాయని రంగనాథ్ తెలిపారు. ఇకపై ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే కూల్చివేతలు, స్వాధీనం సహా తదితర అధికారాలన్నీ హైడ్రాకు లభించాయని రంగనాథ్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో హైడ్రా మరింత బలపడిందని చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం, ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలకు మున్సిపల్ చట్టం ప్రకారం హైడ్రా నడుచుకుంటుందని రంగనాథ్ తెలిపారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో అక్రమ నిర్మాణాలై హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉంది. హైడ్రాకు హైకోర్టులో ఊరట హైడ్రాకు హైకోర్టులో తాజాగా ఊరట లభించింది. జీవో 99, హైడ్రా చర్యలను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఆ పిటిషన్లపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా హైడ్రా ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. హైడ్రా ఏర్పాటును తప్పుపట్టలేమని పేర్కొంది.

## అప్పులు, ఖర్చుల లెక్కలపై కేటీఆర్‌కు భట్టివిక్రమార్క సమాధానం ఇదీ...!

తమ ప్రభుత్వం వచ్చిన ఈ పది నెలల కాలంలో రూ. 56 వేల కోట్లకు పైగా పాత అప్పులు, వడ్డీలను చెల్లించామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఇదే కాలంలో రూ. 49 వేల కోట్ల రుణాలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు, వ్యయంపై ఉపముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. 2023 డిసెంబర్ నుంచి 2024 అక్టోబర్ 15 వరకు అప్పులు, ఆదాయం, ఖర్చుల వివరాలను అందులో పేర్కొంది. అక్టోబర్ 15 వరకు ప్రభుత్వం తీసుకున్న రుణాల మొత్తం రూ. 49,618 కోట్లుగా ఉందని తెలిపింది. పాత అప్పులు, వడ్డీల కోసం రూ. 56,440 కోట్లు చెల్లించినట్లు తెలిపింది. వివిధ పథకాల కోసం రూ. 54,346 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ప్రతి నెల 1వ తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్లు పేర్కొంది. రూ. 80 వేల కోట్లకు పైగా అప్పులు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా కట్టిందా? ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇటీవల ప్రశ్నించారు. దీనికి భట్టివిక్రమార్క తన కార్యాలయం ద్వారా పైవిధంగా సమాధానం ఇచ్చారు.

## తెలంగాణ నుంచి నలుగురు ఐఏఎస్ అధికారుల రిలీవ్: ఏపీ నుంచి ఇద్దరు

ఇది ఇలావుండగా, ఏపీ నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారులు సృజన, హరికిరణ్, శివశంకర్ తెలంగాణ సీఎస్ శాంతికుమారికి రిపోర్టు చేశారు. కాగా, అంతకుముందు, డీవోపీటీ ఆదేశాలపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఐఏఎస్ అధికారులకు హైకోర్టులో కూడా ఊరట దక్కలేదు. తెలంగాణలో పనిచేస్తున్న వాణీ ప్రసాద్, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలిని ఏపీకి, అక్కడ పనిచేస్తున్న సృజన, శివశంకర్, హరికిరణ్ తెలంగాణకు వెళ్లాల్సిందేనని ఇటీవల కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ, డీవోపీటీ ఆదేశించిన విషయం తెలిసిందే. డీవోపీటీ ఉత్తర్వులపై క్యాట్ స్టే ఇవ్వకపోవడంతో.. బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్లు వేశారు ఈ ఐఏఎస్‌లు. జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ ఆలిశెట్టి ధర్మాసనం విచారణ జరిపింది. ఐఏఎస్ ల తరపున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వినిపించారు. క్యాట్ తుది తీర్పు ఇచ్చే వరకు తమను రిలీవ్ చేయవద్దని కేంద్రాన్ని, రెండు తెలుగు రాష్ట్రాలను ఆదేశించాలని ఐఏఎస్ అధికారులు కోరారు. నవంబరు 4న క్యాట్ తదుపరి విచారణ ఉన్నందున, కనీసం అప్పటి వరకైనా ఆగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అయితే, ఐఏఎస్ అధికారుల వాదన సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ వాదించారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేయాలని పరిపాలన వ్యవస్థ నిర్ణయిస్తుందని.. కోర్టులు జోక్యం చేసుకోవద్దన్నారు. స్టే ఇవ్వకూడదన్న క్యాట్ నిర్ణయం సరైనదేనని కేంద్రం వాదించింది. కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లాలన్న తమ ఉత్తర్వులు ఏ విధంగా సమర్థనీయమో పూర్తి వివరాలతో క్యాట్‌లో కౌంటర్లు దాఖలు చేస్తామని ఏఎస్‌జీ తెలిపారు. ఈ వాదనల సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సమాఖ్య దేశంలో రాష్ట్రాలను కూడా విశ్వాసంలోకి తీసుకోవాలి కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. రెండు రాష్ట్రాల అభిప్రాయాలు కూడా పరిగణనలోకి మరోసారి పరిశీలించాలని డీవోపీటీని ఆదేశించమంటారా? అని ఒక దశలో అభిప్రాయం అడిగింది. అయితే వివాదం తర్వాత తేలుతుంది కానీ, ముందయితే అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రంలో చేరాలని స్పష్టం చేసింది. స్టే ఇస్తూ పోతే ఈ అంశం ఎప్పటికీ తేలదని వ్యాఖ్యానించింది. బాధ్యతాయుతమైన అధికారులు.. ప్రజలకు ఇబ్బంది కలగనీయవద్దని పేర్కొంది. ఇరువైపుల వాదనలు విన్న అనంతరం ఐఏఎస్ అధికారుల పిటిషన్లను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పు వెల్లడించింది.

# తెలంగాణలో ఆరుగురు ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లు రిలీవ్. వారి స్థానాల్లో సీనియర్లకు అదనపు బాధ్యతలు



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల మార్పుల ప్రకారం, పలువురు సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించింది. ముఖ్యంగా, ప్రభుత్వం నుంచి రిలీవ్ అయిన ఐఏఎస్ అధికారుల స్థానాలు భర్తీ చేయడానికి ఇన్‌చార్జులను నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి బుధవారం ఈ సంబంధిత ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో రిలీవైన IAS ల అధికారుల స్థానాల్లో సీనియర్లకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమ్రపాలి స్థానంలో GHMC కమిషనర్‌గా ఇలంబర్తి, వాకాటి కరుణ స్థానంలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెక్రటరీగా శ్రీదేవి, రోనాల్డ్ రోస్ స్థానంలో ఎనర్జీ సెక్రటరీగా సందీప్ కుమార్ సుల్తానియా, వాణీ ప్రసాద్ స్థానంలో టూరిజం అండ్ కల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్, ప్రశాంతి స్థానంలో ఆయుష్ డైరెక్టర్‌గా క్రిస్టినా, ఆరోగ్యశ్రీ సీఈవోగా ఆర్.వి. కర్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. క్యాట్, తెలంగాణ హైకోర్టు ఆదేశాలతో ఐఏఎస్ లు గుమ్మడి సృజన, శివశంకర్ సీఎస్ శాంతికి రిపోర్ట్ చేశారు. సీఎస్ ను కలిసి జాయినింగ్ రిపోర్టు అందించారు. కేంద్ర ప్రభుత్వం ఏపీకి కేటాయించిన ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి, రొనాల్డ్‌రోస్, వాణి ప్రసాద్, వాకాటి కరుణలను తెలంగాణ ప్రభుత్వం బుధవారం సాయంత్రం రిలీవ్ చేసింది. దీంతో ఈ అధికారులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మెయిల్ ద్వారా రిపోర్ట్ చేయనున్నారు. ఈ అధికారులు ఏపీకి వెళ్లాల్సిందేని డీఓపీటీ ఇచ్చిన ఆదేశాలను క్యాట్, తెలంగాణ హైకోర్టు సమర్థించడంతో వీరు తెలంగాణను వీడక తప్పని పరిస్థితి ఏర్పడింది. రిలీవ్ అయిన నలుగురు ఐఏఎస్‌ల స్థానంలో ఇన్‌ఛార్జి అధికారులను తెలంగాణ ప్రభుత్వం నియమించింది.

## మూడు రోజుల పాటు ఇండియా మొబైల్ కాంగ్రెస్




శాసనసభ / హైదరాబాద్ : దేశ రాజధాని ఢిల్లీలో మూడు రోజుల పాటు ఇండియా మొబైల్ కాంగ్రెస్ జరుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇవాళ ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ.. సదస్సుకు జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయి టెలికాం కంపెనీలు హాజరయ్యాయని, దాదాపు 33 దేశాల కు సంబంధించిన ప్రజాప్రతినిధులతో పాటు, వివిధ దేశాల నుంచి బహుళ జాతి సంస్థల ప్రతినిధులు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిన్న ప్రారంభించారని, అనేక టెలికాం కంపెనీలకు సంబంధించిన సంస్థల ప్రతినిధులతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమావేశమై చర్చించామన్నారు. నిన్న కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా తో ప్రత్యేకంగా టెలికామ్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీని రాష్ట్రాలకు నిర్ణయం చేయొచ్చని పాలసీ నిర్ణయం చేయడం హర్షణీయమన్నారు. తెలంగాణ టెలికాం మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ తెలియజేయడం జరిగిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్ గా తీసుకొని విధానపర నిర్ణయం తీసుకొని పాలసీని ఇనిషియేట్ చేస్తామని, దీనివల్ల అనేక టెలికాం మ్యానుఫ్యాక్చరర్స్ రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అతి త్వరలో దాన్ని తీసుకొచ్చే కార్యక్రమం తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేకించి ఐటీ మినిస్టర్ల సమావేశం కూడా జరిగిందని, జ్యోతి రాధిక సింగ్ , పెమ్మసాని చంద్రశేఖర్ ల ఆధ్వర్యంలో ఐటీ మినిస్టర్ల కాన్ఫరెన్స్ జరిగిందన్నారు. ప్రభుత్వం తరపున టీ ఫైబర్, ఆప్టికల్ ఫైబర్ నెట్వర్క్ సంబంధించి గ్రామానికి ప్రతి ఇంటికి నెట్వర్క్ సదుపాయం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని వివరించామన్నారు 2013లో మొదలు పెట్టినటువంటి ఈ అంశం 2014 తర్వాత భారత నెట్ అని ఫేస్ టు ఫేస్ వన్ అని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమని, 3000 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయింపు చేసుకొని అండర్ గ్రౌండ్ లో ఫైబర్ నెట్వర్క్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అండర్ గ్రౌండ్ నుంచి నెట్వర్క్ ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకత అని, నెట్వర్క్ పూర్తిస్థాయిలో కంప్లీట్ కావాలంటే నిధులు అవసరం%ొ% మాకు ఉన్న ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్ళామన్నారు. దాదాపు 1600 కోట్లకు పైగా అవసరమని, వెంటనే వాటిని తెలంగాణా కు కేటాయించాలని కేంద్రాన్ని కోరామన్నారు. గతంలోనే కేంద్ర ప్రభుత్వం ముందు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావన తీసుకొచ్చారని, అటవీ ప్రాంతాలకు సంబంధించి ఫైబర్ నెట్వర్క్ కోసం అటవీ శాఖా అనుమతులు రావాల్సి ఉందని శ్రీధర్ బాబు వెల్లడించారు. అనుమతుల అంశాన్ని కేంద్రం పరిష్కారం చేయాలని కోరడం జరిగిందని, తెలంగాణ ప్రభుత్వం కోరిన అంశాలను కేంద్రం సమీచేసి పరిష్కారం ఇచ్చే దిశగా చూస్తామని స్పష్టం చేశారని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఎన్నో దేశ విధాల విదేశాలకు సంబంధించిన టెలికాం సంస్థలు ఉన్నాయి ప్రభుత్వం తరపున వాళ్లను ప్రత్యేకంగా కొరటం జరిగిందని, ఇండస్ట్రీల ప్రోత్సాహానికి తెలంగాణలో ప్రత్యేకంగా వాతావరణం సానుకూలంగా ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరామని, స్ట్రైట్ అనే కంపెనీ తో ఎంవోయు కుదుర్చుకున్నామని తెలిపారు శ్రీధర్‌బాబు.

( మొదటి పేజీ తరువాయి )

## కొత్త పాలసీలు రాష్ట్ర ప్రగతిని మారుస్తాయి

రాష్ట్రంలో ఐదుజోన్లలో ఇన్నోవేషన్ హబ్‌లు..‘‘అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తాం. ఐదు జోన్లలో (విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయవాడ లేదా గుంటూరు, అనంతపురం) ఐదు ఇన్నోవేషన్ రతన్ టాటా హబ్‌లు వస్తాయి. ఆధునిక టెక్నాలజీని ప్రజలకు మరింత చేరువ చేస్తాం. కొత్త పాలసీలతో ఏపీలో పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. నాలెడ్జ్ ఎకానమీకి ఏపీ ఇన్నోవేషన్ హబ్‌గా మారాలి. కృష్ణా జలాలు రాయలసీమకు ఇవ్వొచ్చని చెప్పింది ఎన్టీఆర్. అది చేసి చూపించింది తెలుగుదేశం పార్టీ. నదుల అనుసంధానంతోనే ఏపీ అభివృద్ధి. దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునర్ నిర్మించాల్సి ఉంది. భారీగా విదేశీ పెట్టుబడులు తీసుకురావాల్సి ఉంది. ఆదాయం పెంచి ప్రజలకు పంచాలన్నదే మా నినాదం. ఆక్వా కల్చర్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ తయారవుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాం. ఫుడ్ హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ మారుతుంది. దేశంలో తొలిసారిగా పరిశ్రమల డీకార్బనైజేషన్‌ను ప్రోత్సహిస్తాం’’ అని సీఎం చంద్రబాబు తెలిపారు. రూ. 30లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యం...‘‘జీరో బడ్జెట్, నేచురల్ ఫార్మింగ్‌కు ఏపీ చిరునామా. నవంబరు మొదటి వారంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేస్తాం. స్వర్ణాంధ్ర 2047లో భాగంగా మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారుస్తాం. ప్రపంచ దేశాల్లో మార్కెటింగ్ వచ్చేలా మన ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దుతాం. గ్రీన్ ఎనర్జీ, నదుల అనుసంధానం, పోర్టులను కూడా అనుసంధానం చేస్తాం. 40 బిలియన్ డాలర్ల ఎగుమతులు.. రూ. 30లక్షల కోట్ల పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఉత్పత్తి వ్యయం తగ్గేలా చర్యలు ఉంటాయి. విశాఖ నుంచి భావనపాడు వరకు రహదారి నిర్మిస్తాం. భావనపాడులో 10వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తాం. ఉత్తరాంధ్రను కూడా పోర్టులు, టూరిజంతో అభివృద్ధి చెందేలా కార్యాచరణ. ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసి పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం’’ అని సీఎం తెలిపారు.

## అవిభక్త కవలలు వీణా-వాణీకి 22 ఏళ్లు.. ప్రస్తుతం ఎక్కడున్నారు..? ఏం చేస్తున్నారు..?



శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణలో అవిభక్త కవలలు వీణ-వాణీ 22వ వసంతంలోకి అడుగుపెడుతున్నారు. బుధవారం (అక్టోబర్ 16న) రోజున 22వ బర్త్ డే జరుపుకోనున్నారు. అవిభక్త కవలలుగా జన్మించిన వీణా-వాణీని విడదీసేందుకు ప్రభుత్వాలు, వైద్యులు ఎన్ని ప్రయత్నాలు చేసినా..ఫలితం లేకుండా పోయింది. వీరిని విడదీసేందుకు.. ఇక్కడి పెద్ద పెద్ద వైద్యులతో పాటు ఫారిన్ డాక్టర్లు కూడా ప్రయత్నాలు చేశారు. కానీ..ఫలితం మాత్రం దక్కలేదు. ప్రస్తుతం 22వ జన్మదినం జరుపుకుంటున్న వేళ.. వాళ్లు ప్రస్తుతం ఏం చేస్తున్నారు.. వారి ఆరోగ్య పరిస్థితి ఏంటీ అని చాలా మంది తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

( మొదటి పేజీ తరువాయి )

## రేవంత్ రెడ్డి పిచ్చోడిలా మాట్లాడుతున్నాడు

సీఎం అజ్ఞానిలా మాట్లాడుతున్నారన్నారు. దిల్‌సుఖ్ నగర్‌లో విమానాలు కొనడానికి దొరుకుతున్నాయని ఒకసారి అంటారని, హైదరాబాద్‌కు మూడు వైపులా సముద్రం ఉంటుందని మరోసారి అంటారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా ఉందన్నారు. ఆయన తెలివి ఉండి మాట్లాడుతున్నారా? తెలివి లేక మాట్లాడుతున్నారా? అని విమర్శించారు. పాలనపై పట్టులేక పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా దాటవేత ధోరణి అవలంభిస్తున్నారని వ్యాఖ్యానించారు.

## బీజేపీపై అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు

జైల్లో ఉన్నప్పుడు తనకు ఇన్సులిన్ ఇవ్వకుండా చంపేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయడం తెలిసిందే. దీంతో ఆయన కొన్ని నెలల పాటు తీహార్ జైల్లో ఉన్నారు. ప్రస్తుతం ఆయన బెయిల్‌పై బయట ఉన్నారు. తాజాగా, ఆయన మాట్లాడుతూ... తనకు మధుమేహం లెవల్స్ పెరిగాయని, దీంతో తాను రోజూ నాలుగు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకుంటానని వెల్లడించారు. జైల్లో ఉన్న తాను ఇన్సులిన్ తీసుకోకపోతే కిడ్నీలు ఫెయిలై చనిపోయేలా వాళ్లు కుట్రలు పన్నారని బీజేపీని ఉద్దేశించి అన్నారు. కానీ ఢిల్లీ ప్రజల ఆశీస్సులతో బయటకు వచ్చానన్నారు. గత పదేళ్ల కాలంలో ఎల్జీని అడ్డుపెట్టుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కానీ వారి ప్రయత్నాలను తాము తిప్పికొట్టామన్నారు. పంజాబ్‌లో తమ గెలుపు తర్వాత... ఢిల్లీలో తమను ఆపకపోతే దేశవ్యాప్తంగా ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తుందని వారు భయపడుతున్నారన్నారు. తాను జైల్లో ఉండగా ఢిల్లీ అభివృద్ధి పనులను ఆపేశారని, తాను జైలు నుంచి విడుదలయ్యాక వాటిని తమ ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందన్నారు.

## తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు ఇదే: హరీశ్ రావు

రూ. 15 వేలు రైతుబంధు ఇస్తానని చెప్పి గుండుసున్నా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కంటే మంచి కిట్ ఇస్తానని చెప్పి పేద గర్భిణీలను మోసం చేశాడని ధ్వజమెత్తారు. ఆగస్టులోనే వేయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా వేయలేదని మండిపడ్డారు. చేప పిల్లలకు బడ్జెట్ కూడా కేవలం రూ. 16 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ముఖ్య నేతల కోసం ఓఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్ మార్చారని హరీశ్ రావు ఆరోపించారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొంతమంది నేతలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. దక్షిణ భాగాన్ని కేంద్రం నిర్మించాలని, కానీ కావాలనే రాష్ట్ర ప్రభుత్వం తాము నిర్మిస్తామని చెబుతోందన్నారు.

## గుంతలో పడి గాల్లోకి ఎగిరిన కారు - మెదక్ జిల్లాలో ఏడుగురు దుర్మరణం

మెదక్ జిల్లాలో ఏడుగురు దుర్మరణం దావత్ నుంచి వస్తుండగా : మృతులను భీమ్లా తండాకు శాంతి (38), మమత (12), సీతారాం తండాకు చెందిన అనిత (35), హిందూ (13), శ్రావణి (12), తలపల్లి తండాకు చెందిన శివరాం (56), దుర్గి (45) గా గుర్తించారు. ప్రమాదంలో డ్రైవింగ్ సీట్లో ఉన్న నామ్‌సింగ్ (40)కు తీవ్ర గాయాలయ్యాయి. అతని రెండు కాళ్లు విరిగాయి. వైద్యం కోసం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో నామ్‌సింగ్ భార్య శాంతి, కుమార్తె మమత, అత్త, మామ, మరదలు కూడా మృతి చెందినట్లు గుర్తించారు. వీరంతా తూప్రాన్ దగ్గర ముత్యాలమ్మ గ్రామ దేవత దావత్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం పంపించారు. ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. ర్యాష్ డ్రైవింగ్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని అంచనాకు వచ్చారు. ఊపిరి ఆడక ఏడుగురు కారులోనే చనిపోగా డ్రైవర్ నామ్ సింగ్ ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డాడని తెలిపారు. అతను ప్రస్తుతం స్పృహలో లేదని తరువాత అతనికి డ్రంక్ డ్రైవ్ టెస్ట్ చేసి మద్యం మత్తులో ఉన్నడా లేడా అనేది తెలుస్తామని తెలిపారు. ఈ ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్న సీఎం.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స, అవసరమైన సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు మాజీ మంత్రి హరీష్ రావు కూడా బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గాయపడిన నామ్‌సింగ్‌కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

శాసనసభ తెలుగు దినపత్రిక



# మంత్రి కొండా సురేఖపై ఎమ్మెల్యేల ఫిర్యాదు..!



శాసనసభ / హైదరాబాద్ : మంత్రి కొండా సురేఖ వ్యవహారశైలి కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. కొద్ది రోజుల క్రితం కేటీఆర్ ను విమర్శించే క్రమంలో అక్కినేని నాగ చైతన్య, సమంతపై మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.దీంతో ఆమె వ్యాఖ్యలను టాలీవుడ్ ప్రముఖులు తీవ్రంగా ఖండించారు. దీంతో ఆమె వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. సమంతకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. అయినప్పటికీ అక్కినేని నాగార్జున ఈ విషయంలో వెనక్కు తగ్గలేదు. కొండా సురేఖపై పరువు నష్టం దావా కేసు వేశారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.ఇది ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొండా సురేఖ వ్యవహారశైలి సొంత ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారింది. బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మంత్రిపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తమను కొండా సురేఖ వర్గీయులు ఇబ్బంది పెడుతున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే కార్యకర్తల అత్యుత్సాహం వల్లే పరకాల విషయం ఇష్యూ అయిందని.. అందరితో మాట్లాడి సమస్యలు లేకుండా చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.దసరా సందర్భంగా పరకాలలో మంత్రి కొండా సురేఖ వర్గీయులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీల్లో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఫొటో లేదు. దీంతో ప్రకాశ్ రెడ్డి మద్దతు దారులు ఫ్లెక్సీలను చించేశారు. దీంతో మంత్రి వర్గీయులు, ప్రకాశ్ రెడ్డి వర్గీయుల మధ్య గొడవ జరిగింది. దీంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న కొండా సురేఖ పోలీస్ స్టేషన్ కు వెళ్లారు. సీఐ సీట్లో కూర్చుని తన మనుషులనే అరెస్ట్ చేస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ మారింది.దీంతో పార్టీ పెద్దలు కొండా సురేఖను హెచ్చరించినట్లు తెలుస్తోంది. జాగ్రత్తగా ఉండాలని.. అనవసర రాద్ధాంతం చేయవద్దని కోరినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ మొదటి నుంచి ఫైర్ బ్రాండ్ లీడర్ గా ఉన్నారు. ఆమె ఎక్కడా తగ్గకుండా మాట్లాడుతుంటారు. ఎదురుటి వారు ఎంతవారైనా ఎందురించి మాట్లాడే ధైర్యం ఉంది. అయితే ఇప్పుడు ఈ వ్యవహారశైలి ఆమెను వివాదాల్లోకి నెట్టుతోంది.

# రేవంత్ మంత్రుల్లో ఒకరు డ్రాప్, ఆ 5గురికి ఛాన్స్ - హైకమాండ్ ఛాయిస్..!?

శాసనసభ / హైదరాబాద్ : తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం అవుతోంది. కాంగ్రెస్ హైకమాండ్ ఈ మేరకు సీఎం రేవంత్ కు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలో ఖాళీల భర్తీతో పాటుగా ఒక మంత్రికి ఉద్వాసన..శాఖల మార్పు ఖాయమని సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరయ్యేందు కు ఢిల్లీ వెళ్తున్న రేవంత్..తుది జాబితా పైన చర్చించనున్నారు. అదే విధంగా నామినేటెడ్ పదవుల భర్తీ పైన ఈ పర్యటనలో ఫైనల్ నిర్ణయం జరిగే అవకాశం ఉంది.ఢిల్లీకి సీఎం రేవంత్ ముఖ్యమంత్రి రేవంత్ రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. రేపు (గురువారం) జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హాజరు కానున్నారు. ఆ తరువాత పార్టీ అధినాయకత్వంతో సమావేశం అవుతారు. ఈ భేటీలో మంత్రివర్గ విస్తరణ పైన తుది చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఈ నెలాఖరులోకా మంత్రివర్గ విస్తరణ పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయాలని రేవంత్ భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే హైకమాండ్ కు నివేదిక ఇచ్చారు. దీంతో, దీపావళికి ముందే మంత్రివర్గ విస్తరణ ఖాయమని పార్టీ ముఖ్య నేతలు చెబుతున్నారు.సురేఖ పై సీరియస్ రేవంత్ మంత్రివర్గంలో ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఒకరిని తొలిగించటం ఖాయమని తెలుస్తోంది. మంత్రి సురేఖ వ్యవహార శైలి పైన పార్టీ నాయకత్వం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. నాగార్జున కుటుంబం పైన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు..మంత్రిగా ఉంటూ సొంత పార్టీ నేతలతో వైరం.. పోలీసు స్టేషన్ కు వెళ్లటం.. సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఢిల్లీ దాకా వచ్చి ఫిర్యాదులు చేయటాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది.



దీంతో..సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించటం ఖాయమనే అభిప్రాయం పార్టీ ముఖ్యుల్లో వినిపిస్తోంది. అదే సమయంలో కొత్తగా అయిదుగురికి మంత్రివర్గం లో అవకాశం దక్కటం ఖాయమైనట్లు సమాచారం.

ఛాన్స్ దక్కేదెవరికి సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకొని అయిదుగురు ఎంపిక పైన రేవంత్ తో భేటీ సమయంలో నిర్ణయం జరగనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి సీనియర్ నాయకుడు ప్రేమ్ సాగర్ రావుతో పాటు, వివేక్, వినోద్ సోదరులు రేసులో ఉన్నారు. వీరిలో వివేక్ కు మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం తాజాగా మంత్రి పదవి రేసులో ముందుకు వచ్చారు.ఆయన సోదరుడు మంత్రిగా ఉండటంతో.. రాజగోపాల్ కు ఇప్పుడే ఛాన్స్ ఇస్తారా లేదా అనేది చూడాలి. రంగారెడ్డి నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలో ఒకరికి మంత్రి పదవి ఖాయమని చెబుతున్నారు. ముదిరాజ్ వర్గానికి మంత్రివర్గంలో అవకాశం ఇస్తే మహబూబ్ నగర్ కు చెందిన శ్రీహరి పేరు రేసులో ఉంది. దీంతో, వారం రోజుల్లో తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఖాయమని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. దీంతో, ఎవరికి అవకాశం దక్కుతుందనేది ఇప్పుడు ఆసక్తిని పెంచుతోంది.

# ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు



శాసనసభ / హైదరాబాద్: ఉన్న పథకాలు బంద్ పెట్టడమే కాంగ్రెస్ తెచ్చిన మార్పు అని హరీష్ రావు అన్నారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. ఒక చీర కాదు..రేవంత్ రెడ్డి రెండు చీరలు అన్నాడు, దసరా పండుగకు అక్క చెల్లెళ్ళను ప్రభుత్వం నిరుత్సాహపరిచిందన్నారు. 15వేలు రైతుబంధు అన్నాడు .. గుండు సున్నా చేశాడని ఆయన విమర్శించారు. కేసీఆర్ కిట్ కంటే మంచి కిట్ ఇస్తామని పేద గర్భిణి స్త్రీలను మోసం చేశాడని హరీష్ రావు మండిపడ్డారు. ముదిరాజ్, గంగపుత్రులంటే సీఎం రేవంత్ కు చిన్నచూపని, ఆగస్ట్ లో పోయాల్సిన చేప పిల్లలను అక్టోబర్ వచ్చినా పోయలేదన్నారు. మేము 100కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల కోసం బడ్జెట్ లో పెట్టిందె 16కోట్లు అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. చేప పిల్లలు డబుల్ పోస్తామని చెప్పి.. ఇప్పుడు చేప పిల్లలు సగమే పోయాలని అంటున్నారన్నారు. చెరువులు నిండుకుండలా ఉన్నప్పటికీ.. చేప పిల్లల సగమే పోయాలంటున్నారని, ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన మార్పు అంటూ ఆయన సెటైర్ వేశారు.అంతేకాకుండా..'కాంగ్రెస్ ముఖ్యనేతల కోసం రీజల్ రింగ్ రోడ్ దక్షిణ భాగం అలైన్మెంట్ మార్చారు. ముఖ్యనేతల భూములున్నాయని రేవంత్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది. కొందరు స్వార్థం కోసం ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్మెంట్ మార్చటం దారుణం. దీని వలన 16కిమీ దూరం పెరుగుతుంది. కేంద్రమే నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ.. దక్షిణ భాగాన్ని కావాలనే రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తామంటోంది. దీని వలన 20వేల కోట్లు అదనంగా ఖర్చు అవుతాయి. కొందరు స్వార్థం కోసం ప్రజలపై 20వేల కోట్లు భారం పడుతుంది. రుణమాఫీకి పుట్టని అప్పు.. రింగ్ రోడ్ నిర్మాణానికి పుడుతున్నాయా? ఉత్తర భాగం 158కిమీ కేంద్రమే నిర్మిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 10నెలలు అయినా కూడా ఉత్తర భాగం నిర్మాణం కోసం భూసేకరణ ప్రక్రియ ముందుకు సాగటం లేదు. రైతులకు మార్కెట్ రేటు ఇచ్చి భూసేకరణ చేయాలి' అని హరీష్ రావు అన్నారు.

# తెలంగాణలోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన..!



శాసనసభ / హైదరాబాద్ : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. దీని ప్రభావంతో తెలంగాణలో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.బుధవారం సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని వివరించింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. హైదరాబాద్ లో గత మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం, మంగళవారం, బుధవారం హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది.మంగళవారం ఉదయం మాదాపూర్, హైటెక్ సిటీ, బోరబండ, మోతినగర్, ఎర్రగడ్డ, ఎస్సార్ నగర్, అమీర్ పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్ పాటు పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచింది. జీహెచ్ఎంసీ సిబ్బంది రోడ్డుపై నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు. బుధవారం హైదరాబాద్ లో వాతావరణం మారింది. తెల్లవారుజాము నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. పలు ప్రాంతాల్లో జల్లులు కురిశాయి. కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయం కావడంతో వాహనదారులు కాస్త ఇబ్బంది పడ్డారు.తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుల్లో నీటి మట్టం పెరుగుతోంది. నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ కు పై నుంచి వరద తాకిడి పెరిగింది. దీంతో అధికారులు ప్రాజెక్టు 4 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 312 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 312 టీఎంసీలుగా ఉంది. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోతకు వచ్చిందని.. ఈ సమయంలో వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని భయపడుతున్నారు.ఈ వాయుగుండం ప్రభావంతో ఏపీలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో వర్షం కురిసింది. భారీ వర్షాల నేపథ్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రెండ్రోజులు విద్యాసంస్థలకు సెలవు ఇచ్చారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అటు చెన్నై, బెంగళూరులో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కాగా ఈసారి తెలంగాణలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# సీఎం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు.. కేటీఆర్ ఫైర్

శాసనసభ / హైదరాబాద్ : నోటీసులు ఇవ్వకుండా ఇళ్లు కూలగొడుతున్నారని నేడు నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజమెత్తారు. అదేవిధంగా.. మూసీ పేరుతో లూటీ చేస్తున్నారని, మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వానికి స్పష్టత లేదని పేర్కొన్నారు.నాచారం, ఉప్పల్ లో మేమే మూసీ సివరేజ్ ప్లాంట్స్ ఏర్పాటు చేశామని, సివరేజ్ ప్లాంట్స్ పూర్తయితే మూసీ దిగువన శుద్ధి చేసిన నీళ్లే వెళతాయని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో హైదరాబాద్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నల్గొండకు నీళ్లు ఇవ్వడం మీకు ఇష్టం లేదా అని సీఎం ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు. బిల్డర్లు, పెద్ద వ్యాపారులను బెదిరించేందుకే హైడ్రాను తీసుకొచ్చారంటూ కేటీఆర్ తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేసారు. ఈ సమావేశంలో పలువురు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈ సమ వేశంలో ఆయన మాట్లాడుతూ.. హైడ్రాను అడ్డు పెట్టుకుని బిల్డర్లు, వ్యాపారవేత్తల నుంచి రేవంత్ సర్కార్ వసూళ్ళకు పాల్పడుతోందని., హైడ్రా పేరుతో వసూలు జరుగుతున్నాయని అందుకు గాను ఎంఐఎం వాళ్ళు కాంగ్రెస్ నేతలను కొట్టారని ఆయన అన్నారు. అఖిలపక్షం సమావేశం కాదని.. మూసీ పరివాహక ప్రాంతంలో ప్రజలతో మీటింగ్ పెట్టాలని అన్నారు. పార్టీల అభిప్రాయాలు కాదు.. ప్రజల అభిప్రాయాలు తీసుకోవాలని, సీఎం రేవంత్ బీజేపీ ఉన్నారా లేక కాంగ్రెస్ ముఖ్యమంత్రినా అని ప్రశ్నించారు. ఉన్నట్లుండి రేవంత్ కు దేశరక్షణ గుర్తొచ్చిందని, గతంలో ఆర్మీలో ఏమైనా రేవంత్ పనిచేశాడా? అక్రమ నిర్మాణమైతే.. నా ఫాంహౌస్ ను కొట్టేయొచ్చు కదా అని మాట్లాడారు. పేదల కడుపు కొట్టకుండా మూసీ సుందరీకరణ చేసుకోవచ్చని, సంక్షేమ పథకాలకు లేని




నిధులు హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బులు ఎక్కడవని ప్రశ్నించారు. మూసీకి పురిట్లోనే గండి కొట్టి.. హైదరాబాద్ వచ్చి సుందరీకరణ అంటున్నారని, అలాగే దామగుండం నేవీ రాడార్ స్టేషన్స్ ను అమెరికా, యూకే లాంటి దేశాలు వాడటం లేదని తెలిపారు.పర్యావరణ ప్రేమికుల సూచన మేరకు కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్స్ ఆలోచనను విరమించుకున్నామని, దిక్కుమాలిని పాలన వలన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందని, సీఎం దివాలాకోరు మాటల వలనే అప్పు పుట్టడం లేదని మంత్రి తుమ్మల గుర్తుంచుకోవాలని ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అడ్డంగా ఉంటారని, కాంగ్రెస్ హాయాంలోనే అనుమతిలిచ్చి.. ఇప్పుడు కూల్చుతున్నారని డిప్యూటీ సీఎంకు తెలియదా? అని ఆయన అన్నారు.మరోవైపు మోడీని చూస్తే.. రేవంత్ రెడ్డికి హడల్ అని, మూసీ సుందరీకరణ వెనుక భారీ కుంభకోణం ఉందని ఆయన అన్నారు. నల్గొండపై సీఎం రేవంత్ రెడ్డివి సన్నాయినొక్కులని, ఎవరి కడుపు కొట్టకుండానే.. బీఆర్ఎస్ హాయాంలోనే మూసీ సుందరీకరణ ప్రారంభించామని అన్నారు. మేము కట్టిన శుద్ధీకరణ ప్లాంట్లు ఉపయోగించి.. నల్లగొండ నీళ్ళి పంపొచ్చని, దుందుడుకు చర్యలపై క్షేత్రస్థాయి పర్యటనలకు రెడీ అవుతున్నట్లు కేటీఆర్ తెలిపారు.

# అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది మీరు



శాసనసభ / హైదరాబాద్ : తొమ్మిదన్నరేళ్లలో మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది మీరు. అప్పుల వారసత్వానికి ఆద్యులే మీరని బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు మంత్రి సీతక్క.ఇవాళ ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మీ హయాంలో అక్షరాల రూ. 7 లక్షల కోట్ల అప్పులు చేసారు. వాటికి కిస్తీలు, వడ్డీల కోసం ప్రతి రోజు టంచన్ గా రూ. 207 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అంటే ప్రతి నెల సగటున 6 వేల కోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను కడగడానికే సరిపోతుందన్నారు. అప్పుల అప్పారావు లాగా అందిన కాడల్లా అప్పులు చేసి.. రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేనితో కొట్టాలన్నారు. అప్పులు చాలవన్నట్లు వేల కోట్ల బకాయిలను మీరు చెల్లించలేదు. చేసిన పనులకూ బిల్లులు చెల్లించలేదు. 5 వేల కోట్ల ఫీ రియంబర్స్ మెంట్ బకాయిలు, ఆరోగ్య శ్రీ బకాయిలు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, సర్పంచులకు పెండింగ్ బకాయిలు, విద్యుత్ సంస్థలకు బకాయిలు, ఆర్టీసీకి బకాయిలు, గురుకుల భవనాల ఓనర్లకు అద్దె బకాయిలు, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిధుల పెండింగ్..ఇలా ప్రతి శాఖలో వందల కోట్ల బకాయిలు పెట్టి%ా%ఇప్పుడు బుకాయిస్తే ఏలా? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు.మీ నిర్వాకంతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ.. ఈ పది నెలల కాలంలో 18 వేల కోట్ల పంట రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేసిందని ఆమె వెల్లడించారు. అంతేకాకుండా%ా% మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల వంటింటి భారం దించేందుకు రూ. 500 కే గ్యాస్ సిలిండర్, సామాన్యులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది ప్రజా ప్రభుత్వమని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు.. ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలకు శ్రీకారం చుట్టామన్నారు. అయినా మీరు అప్పులు, బకాయిలు, హామీల గురించి నీతులు చెప్పడం దయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉందని మంత్రి సీతక్క మండిపడ్డారు.

# పీవీ నరసింహారావుకు రతన్ టాటా రాసిన లేఖ ఇదే



శాసనసభ / హైదరాబాద్ : భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు అంటే మొదటగా గుర్తుకువచ్చే పేరు మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుదే. 1990లలో సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలు చేపట్టి..దేశాభివృద్ధికి బాటలు వేశారు పీవీ నరసింహారావు. అయితే, ఆనాడు ప్రధానిగా పీవీ తీసుకున్న నిర్ణయాన్ని బలంగా సమర్థించారు ఇటీవల కన్నుమూసిన పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా. రతన్ టాటా రాసిన లేఖ తాజాగా వైరల్‌గా మారింది.పీవీ ఆర్థిక సంస్కరణల ఎజెండా ప్రధానంగా 'ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ'పై దృష్టి సారించింది. అయితే, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పిలువబడుతున్నప్పటికీ.. కాంగ్రెస్ ఆయన దూరదృష్టితో కూడిన సహకారాన్ని ఎన్నడూ గుర్తించలేదు.అయితే, తాజాగా ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా గత వారం మరణించిన దివంగత రతన్ టాటా.. చేతితో రాసిన నోట్ ఫోటోను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. సంస్కరణలకు మద్దతిస్తూ పీవీ నరసింహా రావును ప్రశంసించారు. 1996లో రాసిన లేఖలో, భారతదేశంలో చాలా అవసరమైన ఆర్థిక సంస్కరణలను ప్రకటించడంలో రావు సాధించిన అద్భుతమైన విజయాన్ని గుర్తించి గౌరవిస్తున్నట్లు టాటా పేర్కొన్నారు.ఆర్థిక సంస్కరణల ద్వారా ప్రభుత్వం భారతదేశాన్ని ప్రపంచ పటంలో నిలిపారని.. నరసింహారావుకు ప్రతి భారతీయుడు కృతజ్ఞతలు చెప్పాలని రతన్ టాటా అన్నారు. కాగా, అయోధ్యలో బాబ్రీ మసీదు కూల్చివేతను అడ్డుకోలేదనే విమర్శలు పీవీపై ఉన్న విషయం తెలిసిందే. దీని కారణంగానే ఆయన సంస్కరణలను కూడా కొందరు విస్మరించారు.పీవీకి రతన్ టాటా రాసిన లేఖ సారాంశం ఉంది:'ఆగస్ట్ 27, 1996 ప్రియమైన శ్రీ నరసింహారావు గారు, నేను ఇటీవలి కాలంలో మీ పట్ల క్రూరమైన రిఫరెన్స్‌లను చదివినప్పుడు.. ఇతరుల జ్ఞాపకాలు చిన్నవే. భారతదేశంలో చాలా అవసరమైన ఆర్థిక సంస్కరణలను తెలియజేయడంలో మీరు సాధించిన అత్యుత్తమ విజయాన్ని నేను ఎల్లప్పుడూ గుర్తించి, గౌరవిస్తానని మీకు చెప్పడానికి మీకు వ్రాయవలసి వచ్చింది. మీరు, మీ ప్రభుత్వం ఆర్థిక కోణంలో భారతదేశాన్ని ప్రపంచ పటంలో ఉంచారు, మమ్మల్ని ప్రపంచ సమాజంలో భాగం చేసారు. భారతదేశం సాహసోపేతమైన, దూరదృష్టితో "ఓపెనింగ్" కోసం ప్రతి భారతీయుడు మీకు కృతజ్ఞతతో రుణపడి ఉండాలి. మీ విజయాలు ముఖ్యమైనవి, అత్యద్భుతమైనవి అని నేను వ్యక్తిగతంగా నమ్ముతున్నాను.వాటిని ఎప్పటికీ మరచిపోకూడదు.

# అశోక్‌నగర్‌లో గ్రూప్ -1 అభ్యర్థుల ఆందోళన



శాసనసభ / హైదరాబాద్ : అశోక్‌నగర్‌లో గ్రూప్స్ అభ్యర్థులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చారు. ఈ నెల 21 నుంచి జరగనున్న టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షలో తప్పులు, జీవో 29ను సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళన చేస్తున్న అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటివరకు 10మందిని అదుపులోకి తీసుకొని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

# ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



శాసనసభ / హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు టాయిలెట్ల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం తో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు.విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయాల్సిన పాఠ్యపుస్తకాల గురించి కలెక్టర్ ఎంఈఓ విజయ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీరు, టాయిలెట్స్, మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. వాటి గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు, టాయిలెట్స్ మరమ్మత్తు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. వాటి పనులను మొదలుపెట్టి త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతతో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించపాల్గొన్న. ఈ సందర్భంగా తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శాసనసభ
తెలుగు దినపత్రిక
గురువారం 17 అక్టోబర్ - 2024

# 20 ఏళ్ల తర్వాతా అదే పరిస్థితి: ప్రభాస్‌పై కృష్ణవంశీ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రభాస్ మంచి నటుడని, అయినా అందరూ ఆయన్ను యాక్షన్ నేపథ్య చిత్రాలకే పరిమితం చేస్తున్నారని దర్శకుడు కృష్ణవంశీ అన్నారు. 'సెన్సిటివ్ మూవీ 'చక్రం'లో నటించేందుకు ప్రభాస్‌ను ఎలా ఒప్పించారు?' అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. " పని పట్ల ప్రభాస్ అంకిత భావంతో ఉంటాడు. మంచి పెర్ఫామర్. టాలీ వుడ్ ఆయన్ను సరిగా వినియోగించుకోవడం లేదు. ఫైట్లకే పరిమితం చేస్తున్నారు. 'చక్రం'తోపాటు అదే సమయంలో వేరే యాక్షన్ ఓరియెంటెడ్ స్టోరీ చెప్పా. 'అందరూ యాక్షన్ కథలే చెబుతున్నారు సర్' అంటూ 'చక్రం' కథ ఎంపిక చేసుకున్నారాయన. 20 ఏళ్ల తర్వాతా పరిస్థితి మారలేదు. ఇప్పటికీ దర్శకులంతా ఆయన్ను యాక్షన్ కథలకే పరిమితం చేస్తున్నారు. గతంలో నేను చెప్పిన సబ్జెక్టుతో ఇప్పుడు సినిమా తీయొచ్చు. కానీ, ప్రభాస్ ఫుల్ బిజీ. నేనేమో అనుకున్న వెంటనే తెరకెక్కించాలనుకుంటా. ఇతర ప్రాజెక్టులు పక్కన పెట్టి నా సినిమా చేయండి అని చెప్పలేను కదా" అని పేర్కొన్నారు.'నిన్నే పెళ్లాడతా' సినిమాని నాగ చైతన్యతో రీ క్రియేట్ చేసే అవకాశం ఉందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. "ఆ చిత్రాన్ని ఎవరితోనూ మరోసారి తెరకెక్కించలేం. చైతన్య శైలికి తగ్గట్టు కొత్త సినిమా తెరకెక్కించాలిగానీ ఉన్నదాన్నే మళ్లీ తీయడం ఎందుకు?" అని పేర్కొన్నారు. శ్రీకాంత్, రవితేజ, ప్రకాశ్‌రాజ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఖడ్గం'. దేశభక్తి ప్రధానంగా రూపొందిన ఈ సినిమా 2002లో ప్రేక్షకుల ముందుకొచ్చి, విజయాన్ని అందుకుంది. ఈ నెల 18న మరోసారి బాక్సాఫీసు ముందుకు రానుంది.

# 'అఖండ 2' షురూ.. పూజా కార్యక్రమంలో పాల్గొన్న బాలకృష్ణ కుమార్తెలు



బాలకృష్ణ కథానాయకుడిగా బోయ పాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రం 'అఖండ 2 – తాండవం' తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. చిత్ర బృందంతో పాటు బాలకృష్ణ కుమార్తెలు నారా బ్రాహ్మణి, తేజస్విని, ఇతర కుటుంబ సభ్యులు ఈ వేడుకలో సందడి చేశారు. చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో సినిమా కోసం తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన 'సింహా', 'లెజెండ్', 'అఖండ' భారీ విజయాన్ని అందుకున్నాయి. 2021లో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'అఖండ' బాలయ్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ల జాబితాలో చేరింది. ఇందులో బాలయ్య ద్విపాత్రాభినయంలో ఆకట్టుకున్నారు. ఈ సినిమా సీక్వెల్ కోసం ప్రేక్షకులంతా ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్నారు. 'అఖండ 2' అద్భుతంగా ఉంటుందని ఇప్పటికే బోయపాటి పలు సందర్భాల్లో తెలియజేశారు. ఈనేపథ్యంలోనే తాజాగా 'అఖండ 2 తాండవం'ను ప్రకటించారు. ప్రగ్యాజైస్వాల్ కీలకపాత్రలో కనిపించనున్నారు. తమన్ స్వరాలు అందించనున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై నిర్మితం కానుంది.

# రజనీకాంత్ - మణిరత్నం సినిమాపై క్లారిటీ..



వరుస సినిమాలతో బిజీగా ఉన్న రజనీకాంత్ త్వరలోనే మణిరత్నం దర్శకత్వంలో ఓ ప్రాజెక్ట్‌లో నటించనున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ విషయమై వీళ్లిద్దరి మధ్య చర్చలు జరిగాయని..అన్నీ అనుకున్నట్లు జరిగితే డిసెంబరులో రజనీ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాపై స్పష్టత వచ్చే అవకాశముందని జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా ఈ వార్తలపై మణిరత్నం భార్య, నటి సుహాసిని క్లారిటీ ఇచ్చారు. అవి రూమర్సేనని స్పష్టంచేశారు. 'రజనీ – మణిరత్నం కాంబోలో ప్రస్తుతానికి ఏ సినిమా రావడంలేదు. వీళ్లిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తున్నట్లు వీళ్లకు కూడా తెలియదు. ఎవరైతే ఇలాంటి రూమర్స్ సృష్టించారో వాళ్లకు మాత్రమే ఈ సినిమా గురించి తెలుసు' అని తనదైన శైలిలో సమాధానమిచ్చారు. దీంతో వీళ్లిద్దరి కాంబినేషన్‌లో సినిమా లేదని స్పష్టమైంది.ప్రస్తుతం రజనీ 'వేట్టయన్' విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. రూ.240 కోట్లు వసూళ్లు చేసి తలైవా హిట్ చిత్రాల లిస్ట్‌లో చేరింది. అలాగే రజనీ 'కూలీ'లో నటిస్తున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్ ఈ చిత్రం రూపొందుతోంది. నాగార్జున, శ్రుతిహాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీనితో పాటు రజనీ లైనప్‌లో 'జైలర్ 2' ఉంది. అలాగే మరో ఇద్దరు యువ దర్శకులు రజనీ కోసం కథలు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. ఇక మణిరత్నం ప్రస్తుతం కమల్‌హాసన్‌తో 'థగ్ లైఫ్' చేస్తున్నారు. 'నాయకన్' (1987) విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న సినిమా ఇది. వేసవిలో ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలుస్తోంది.


# విశ్వక్‌సేన్ మెకానిక్ రాకీ ట్రైలర్ లాంచ్ టైం, వెన్యూ ఫిక్స్



టాలీవుడ్ యాక్టర్ విశ్వక్‌సేన్ నుంచి సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ క్రేజీ నటుడు లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మెకానిక్ రాకీ . విశ్వక్ సేన్ 10 (VS 10)గా తెరకెక్కుతున్న ఈ మూవీకి రవితేజ ముళ్లపూడి (డెబ్యూ) దర్శకత్వం వహిస్తున్నాడు. మీనాక్షి చౌదరి, శ్రద్దా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. టాలీవుడ్ యాక్టర్ విశ్వక్‌సేన్ నుంచి సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ క్రేజీ నటుడు లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మెకానిక్ రాకీ . విశ్వక్ సేన్ 10 (VS 10)గా తెరకెక్కుతున్న ఈ మూవీకి రవితేజ ముళ్లపూడి (డెబ్యూ) దర్శకత్వం వహిస్తున్నాడు. మీనాక్షి చౌదరి, శ్రద్దా శ్రీనాథ్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు.తాజాగా మూవీ ట్రైలర్ అప్‌డేట్ అందించారు మేకర్స్. మెకానిక్ రాకీ ట్రైలర్‌ను అక్టోబర్ 20న శ్రీరాములు థియేటర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. ట్రైలర్ లాంచ్ అప్‌డేట్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ భుజంపై దస్తీ పట్టుకొని మాసీ లుక్‌లో కనిపిస్తుండగా.. ఇరువైపులా మీనాక్షి చౌదరి, శ్రద్దా శ్రీనాథ్‌ను చూడొచ్చు.ఈ చిత్రాన్ని నవంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు మేకర్స్. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తల్లూరి నిర్మిస్తున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. విశ్వక్‌సేన్ మెకానిక్ రాకీగా చేతిలో పానను పట్టుకొని పైకి చూపిస్తున్న లుక్ ఒకటి ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది.మరోవైపు జేక్స్ బిజోయ్ మ్యూజిక్ కంపోజిషన్‌లో పాపులర్ గాయని మంగ్లీ మ్యాజికల్ వాయిస్ అందించిన గుల్లెడు గుల్లెడు సాంగ్ నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో నరేశ్, వైవా హర్ష, హర్షవర్ధన్, రఘురామ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# హెబ్బా పటేల్ లేటెస్ట్ స్టిల్స్

కుమారి 21 ఎఫ్ తో ఓవర్ నైట్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది అందాల భామ హెబ్బా పటేల్. సుకుమార్ రైటింగ్స్ పై తెరకెక్కిన ఈ తో మంచి విజయాన్ని అందుకుంది ఈ అమ్మడు.ఈ లో తన అందంతో ఆకట్టుకుంది ఈ వయ్యారి.కుమారి 21 ఎఫ్ తర్వాత చాలా మంది కుర్రాళ్ళు హెబ్బా పటేల్ కోసం గూగుల్ ను గాలించారు.అంతలా క్రేజ్ తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక ఈ తర్వాత వరుసగా ఆఫర్స్ క్యూ కట్టాయి ఈ చిన్నదానికి.కానీ కుమారి 21 ఎఫ్ లాంటి హిట్ మాత్రం అందుకోలేకపోయింది. ఆతర్వాత మెల్లగా ఆఫర్స్ తగ్గుతూ వచ్చాయి ఈ అమ్మడికి.దాంతో సెకండ్ హీరోయిన్ గా కూడా చేసింది. అయినా పెద్దగా గుర్తింపు రాలేదు. చివరకు స్పెషల్ సాంగ్స్ కూడా చేసింది.ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ అమ్మడు సోషల్ మీడియాతో ఎక్కువగా అభిమానులతో టచ్ లో ఉంటుంది. ఈ క్రమంలోనే కొన్ని ఫోటోలు షేర్ చేసింది ఈ వయ్యారి.



# రకుల్ ప్రీత్ కి తీవ్ర గాయం.. ఏమైందంటే?

నటి రకుల్ ప్రీత్ సింగ్ ఇప్పుడు 'దే దే ప్యార్ దే 2' షూటింగ్‌లో బిజీగా ఉంది.షూటింగ్‌తో పాటు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది రకుల్. అయితే వర్కవుట్ చేస్తున్న సమయంలో రకుల్‌ప్రీత్ గాయపడింది. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని తెలుస్తోంది. రకుల్ వీపు భాగంలో గాయమైందని, జిమ్‌లో వర్కవుట్ సెషన్‌లో డెడ్‌లిఫ్ట్‌లో 80 కిలోల బరువును ఎత్తడం వల్ల వీపుకు గాయమైందని అంటున్నారు. రకుల్ వారం రోజులకు పైగా బెడ్ రెస్ట్‌లో ఉండాలని, ఆమె ఆరోగ్యం మెరుగుపడుతోందని చెబుతున్నారు. 'రకుల్ గత కొన్ని రోజులుగా బెడ్ రెస్ట్‌లో ఉంది. ఆమె పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉందని అంటున్నారు.ఇదంతా అక్టోబర్ 5 ఉదయం రకుల్ తన వ్యాయామం చేస్తున్నప్పుడు జరిగినట్టు తెలుస్తోంది. ఆమె బెల్ట్ ధరించకుండా 80 కిలోల డెడ్‌లిఫ్ట్ చేయగా దాని ఫలితంగా వెన్నునొప్పి వచ్చిందని అంటున్నారు. ఈ క్రమంలో డాక్టర్ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ, ఆమె వరుసగా రెండు రోజులు 'దే దే ప్యార్ దే 2' షూటింగ్ కొనసాగించారని తెలుస్తోంది. 3 రోజులు నొప్పితో బాధపడిన తర్వాత, ఆమె ఫిజియోను కలిశారని అంటున్నారు. అయితే, ప్రతిసారీ నొప్పి 3-4 గంటల తర్వాత తిరిగి వస్తుందని అంటున్నారు. చివరకు పూర్తి బెడ్ రెస్ట్ తీసుకోవాలని డాక్టర్ సూచించారు.ఇప్పుడు ఆమె కోలుకుంటోంది. బెల్ట్ ధరించకుండా 80 కిలోల బరువును ఎత్తడానికి ప్రయత్నిస్తున్నప్పుడు వెన్నెముకలోని ఎల్4, ఎల్5 అలాగే ఎస్1 సమీపంలోని నరాలపై చాలా ఒత్తిడి పడిందని అంటున్నారు.



# సౌతాఫ్రికాతో టెస్టు.. నెరవేరనున్న షకీబ్ అల్ హసన్ కల



సొంత మైదానం మీర్పూర్‌లో చివరి టెస్టు మ్యాచ్ ఆడాలనుకున్న బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ కోరిక నెరవేరనుంది. అక్టోబర్ 21 నుంచి బంగ్లాదేశ్, సౌతాఫ్రికా మధ్య రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానుంది. మిర్పూర్‌లోని షేర్-ఎ-బంగ్లా నేషనల్ స్టేడియం వేదికగా జరగనున్న తొలి టెస్టుకు బంగ్లాదేశ్ జట్టును ప్రకటించారు. ఇందులో షకీబ్ అల్ హసన్‌కు చోటు దక్కింది. దీంతో సొంతగడ్డపై చివరి టెస్టు ఆడాలనే అతని కల నెరవేరనుంది. ఇటీవల షకీబ్ అల్ హసన్ తన రిటైర్మెంట్ ప్రణాళికను వెల్లడించిన సంగతి తెలిసిందే. టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికినట్లు ప్రకటించిన అతడు.. వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీతో వన్డే క్రికెట్‌కు గుడ్‌బై చెప్పనున్నట్లు తెలిపాడు. సౌతాఫ్రికాతో మ్యాచ్ ఆడలేకపోతే భారత్‌తో కాన్పూర్‌లో జరిగిన టెస్టు తన కెరీర్‌లో చివరిది కావొచ్చని చెప్పాడు.ఇటీవల భారత్‌తో రెండు టెస్టులు ఆడిన షకీబ్ నేరుగా అమెరికాకు చేరాడు. బంగ్లాలో అతడిపై హత్యాయత్నం కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఆ దేశంలో తలెత్తిన సంఘర్షణల నేపథ్యంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. దానికి కారణం షేక్ హసీనా ప్రభుత్వమేనని ఆ యువకుడి తండ్రి కేసు పెట్టాడు. హసీనా పార్టీ తరఫున ఎంపీగా గెలిచిన షకిబ్‌పైనా కేసు నమోదైంది. దీంతో అతడు స్వదేశానికి వెళ్లకుండా యూఎస్‌కి చేరాడు. ఇప్పుడు సౌతాఫ్రికాతో టెస్టు ఎంపికైన అతడు త్వరలోనే స్వదేశానికి పయనం కానున్నాడు. బంగ్లాదేశ్‌లో చివరగా ఒకే టెస్టు మ్యాచ్ ఆడతానని, ఆ తర్వాత కుటుంబంతో అమెరికాకు వెళ్లి ఎప్పటికీ స్వదేశానికి తిరిగిరానని కొత్త ప్రభుత్వానికి షకిబ్ కొన్ని రోజుల కిందట లిఖితపూర్వకంగా తెలిపాడు. సౌతాఫ్రికాతో తొలి టెస్టుకు బంగ్లాదేశ్ జట్టు:నజ్ముల్ హొస్సేన్ శాంటో (కెప్టెన్), షాద్మాన్ ఇస్లామ్, మహ్మదుల్ హసన్ జాయ్, జాకీర్ హసన్, మోమినుల్ హక్, ముష్ఫికర్ రహీమ్, షకీబ్ అల్ హసన్, లిటన్ దాస్ (వికెట్‌కీపర్), జాకేర్ అలీ, మెహిదీ హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం, నయీమ్ హసన్, తస్కిన్ అహ్మద్, హసన్ మహమూద్, నహిద్ రాణా

# ఐపీఎల్ 2025.. సన్‌రైజర్స్ హైదరాబాద్ రిటెన్షన్ లిస్ట్ ఇదేనా..?అత్యధిక ధర ఎవరికంటే?



ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు మెగా వేలం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఆటగాళ్ల రిటెన్షన్‌పై కొన్నిరోజుల క్రితం స్పష్టత వచ్చిన విషయం తెలిసిందే.ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఫ్రాంచైజీలకు ఐపీఎల్ పాలకవర్గం అనుమతించింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) కలిసి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఏ జట్టు ఎవరెవరిని రిటైన్ చేసుకుంటుంది? ఎవరిని వదిలేస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తాము రిటెన్షన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.పవర్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ టాప్ రిటెన్షన్‌గా ఉంటాడని ఓ ప్రముఖ క్రీడావెబ్‌సైట్ పేర్కొంది. క్లాసెన్ కోసం ఏకంగా రూ.23 కోట్లు వెచ్చించనుందట. గత సీజన్‌లో కెప్టెన్‌గా వ్యవహరించిన పాట్ కమిన్స్‌ను రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంటుందని సదరు వెబ్‌సైట్ తెలిపింది. 2024 సీజన్‌లో సంచలన ప్రదర్శన చేసిన యువ ఆటగాడు అభిషేక్ శర్మకు రూ.14 కోట్లు చెల్లించి రిటైన్ చేసుకుంటుందట. ట్రావిస్ హెడ్‌తోపాటు ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డిని కూడా సన్‌రైజర్స్ అట్టిపెట్టుకుంటుందని సమాచారం.దిల్లీ క్యాపిటల్స్ ముగ్గురిని మాత్రమే రిటైన్ చేసుకోనున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్ రిషభ్ పంత్‌ని రూ.18 కోట్లు, అక్షర్ పటేల్‌ను రూ.14 కోట్లు, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను రూ.11 కోట్లకు రిటైన్ చేసుకుంటుందని సమాచారం. రిటైన్ చేసుకునే ఆటగాళ్ల కోసం రూ.75 కోట్ల వరకు వెచ్చించడానికి అనుమతి ఉంది. దీంతో గత సీజన్‌లో రాణించిన జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్, ట్రిస్టన్ స్టబ్స్ ధరలు టీమ్ బడ్జెట్‌లో ఉంటే ఆర్‌టీఎం ద్వారా తీసుకోవాలని భావిస్తోందట. ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకున్న ఆటగాళ్ల జాబితాను సమర్పించడానికి అక్టోబర్ 31 డెడ్‌లైన్‌గా విధించారు.

# ఐసీసీ ఆల్‌టైమ్ టెస్ట్ ర్యాంకింగ్స్.. టాప్ 20లోకి జో రూట్



టెస్టు క్రికెట్‌లో సత్తా చాటుతూ అత్యుత్తమ బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు ఇంగ్లాండ్ క్రికెటర్ జో రూట్ . ప్రస్తుతం ఫ్యాబులెస్(ఫ్యాబ్ 4) క్రికెటర్లలో ఒకడిగా ఉన్న రూట్..పాకిస్థాన్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లోనూ దూకుడు కొనసాగిస్తున్నాడు. మొదటి టెస్టులో డబుల్ సెంచరీ బాదిన రూట్.. టెస్టుల్లో తాజాగా మరో ఫీట్ అందుకున్నాడు. ఆల్ టైమ్ ఐసీసీ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్ 20లోకి దూసుకొచ్చాడు.పాకిస్థాన్‌తో తొలి టెస్ట్‌లో ఇంగ్లాండ్ ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రూట్ (262) డబుల్ సెంచరీతో సత్తాచాటాడు. ఈ మ్యాచ్‌కి ముందు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 923 పాయింట్లతో ఉన్న రూట్ ఈ భారీ స్కోర్‌తో 932 పాయింట్లను సాధించాడు. దీంతో ఆల్‌టైమ్ బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్- 20 జాబితాలో చోటు సంపాదించాడు. ప్రస్తుతం రూట్ 17వ స్థానంలో ఉన్నాడు. దీంతో రూట్.. డాన్ బ్రాడ్‌మాన్, రికీ పాంటింగ్, లెన్ హట్టన్ వంటి దిగ్గజ క్రికెటర్ల సరసన చేరినట్లయింది. ఈ జాబితాలో భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ 937 పాయింట్లతో 12వ స్థానంలో ఉన్నాడు.




తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

# జిల్లా అనుబంధం

|| గురువారం 17 అక్టోబర్ - 2024 || పేజీలు : 4

## గౌడన్నల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి








**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వర్గంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు 394 మంది గౌడ సోదరులకు కాటమయ్య రక్షణ కవచాలను గౌరవ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గౌడ సోదరులకు అండగా ఉంటుందని, కుల వృత్తులు చేసుకునే వారికీ ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని, గౌడ సోదరులు ప్రమాదలకు గురికాకుండా ఉండేందుకే ఈ రక్షణ కవచాలు అందిస్తున్నామని,వాటిని ప్రతి ఒక్క కల్లు గీతా కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని, రానున్న రోజుల్లో గౌడ సోదరుల కోరిక మేరకు వారికీ ద్విచక్ర వాహనాల సదుపాయం, అలాగే ప్రతి గ్రామంలో ఈత చెట్ల పెంపకానికై ప్రభుత్వ భూమి కేటాయింపు విషయాలు ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి గౌడ సోదరుల కోరికలు తీర్చే విదంగా కృషి చేస్తానని,ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర, జిల్లా బ్లాక్ మండల మున్సిపల్ నాయకులు,నియోజకవర్గం లోని ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు,బీసీ సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు,నియోజకవర్గ గౌడ సంఘం ప్రతినిధులు,కల్లు గీతా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి రంగుల వేసిన వారిని పట్టుకుని శిక్షిస్తాం

### - ఇబ్రహీంపట్నం ఏసీపీ కెపీవి రాజు

**యాచారం, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మాల్ వ్యాపార కేంద్రంలో ప్రధాన రహదారి లో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు అంబేద్కర్ విగ్రహానికి రంగు వేసినారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేయడంతో ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు , యాచారం సీఐ శంకర్ కుమార్ వచ్చి అంబేద్కర్ గారి విగ్రహం మీద రంగు వేసిన నిందితులను కచ్చితంగా శిక్షిస్తామని హామీఇచ్చారు. అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలదండ వేసి నివాళి అర్పించడం జరిగింది.



## బాణసంచా దుకాణాల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి: పోలీస్ కమిషనర్



**హైదరాబాద్ / శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఖమ్మం జిల్లాలో బాణసంచా దుకాణాలు పెట్టుకోదలచిన వ్యాపారులు అక్టోబర్ 25 తేది సాయంత్రం లోపు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొందాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలలో వ్యాపారులు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, నగర పాలక శాఖ, అగ్నిమాపక శాఖలు నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే అనుమతితో దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణసంచా విక్రయించే వ్యాపారులతో పాటు, టపాకాయలు కాల్చే ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ధరఖాస్తుతో పాటు **AE** –5 ఫామ్, సెల్ఫ్ అఫిడవిట్ , చలానా రిసీప్ట్,. ఆధార్ కార్డ్ , ఫోటో జతపరచి పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలి. అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీపావళి సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా బాణసంచా విక్రయదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

## ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందిస్తున్న మండల విద్యాధికారి అంజయ్య



**చింతపల్లి, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** నూతనంగా విధుల్లో చేరుతున్న డీఎస్సీ - 2024 ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న చింతపల్లి మండల విద్యాధికారి నీరుడు అంజయ్య. ఈ సందర్భంగా వారికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని,కావున మండలం లోని పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాటుపడాలని విద్యార్థులకు నాణ్యమైన విద్య ను అందించాలని నూతన ఉపాధ్యాయులకు సూచించారు. మండలానికి 16 మంది ఉపాధ్యాయులకు ఎస్ ఏ పోస్ట్ 1, ఎల్ పి తెలుగు 1, ఎస్ జిటి పోస్టులు 14 నియమించ బడ్డాయని తెలిపారు.

## పేర్వాల చంద్ర రెడ్డి మృతి బాధాకరం

### - జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

**దేవరకొండ, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** డిండి మండలం వావిల్ కోల్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పేర్వాల చంద్ర రెడ్డి మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం వావిల్ కోల్ గ్రామంలో చంద్ర రెడ్డి మృతి దేహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్ర రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్ర రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆయన వెంట టీవీఎన్ రెడ్డి,మాధవరం శ్రీనివాస్ రావు,పేర్వాల జాంగా రెడ్డి,తీర్పతయ్య,సతి రెడ్డి,తదితరులు ఉన్నారు.



శాసనసభ
గురువారం 17 అక్టోబర్ - 2024

# పేర్వాల చంద్ర రెడ్డి మృతి బాధాకరం : మాజీ ఎమ్మెల్యే



**దేవరకొండ అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** డిండి మండలం వావిల్ కోల్ గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ పేర్వాల చంద్ర రెడ్డి మృతి బాధాకరం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం వావిల్ కోల్ గ్రామంలో చంద్ర రెడ్డి మృతి దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.చంద్ర రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.చంద్ర రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఆయన వెంట రాజినేని వేంకటేశ్వర్ రావు,TVN రెడ్డి,మాధవరం శ్రీనివాస్ రావు,పేర్వాల జాంగా రెడ్డి,తీర్పతయ్య,సతి రెడ్డి,తదితరులు ఉన్నారు.

# బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయండి

## - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్ గౌడ్





**చింతపల్లి,అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి విచ్చేసిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ళ వీరేందర్ గౌడ్. ఈ సందర్భంగా పుల్ల వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బి ఆర్ ఎస్ పార్టీ భూస్థాపితం అయిందని, కాంగ్రెస్ పార్టీ పైన ప్రజల్లో పూర్తి వ్యతిరేకత వచ్చేసిందన్నారు. తెలంగాణలో మనమే అధికారంలోకి రాబోతున్నాం మండలంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. ప్రతి క్రియాశీల కార్యకర్త 100 సభ్యత్వాలు చేయించేయాలన్నారు. భవిష్యత్తులో పార్టీ బాధ్యతలు స్వీకరించాలన్న ప్రజాప్రతినిధిగా పార్టీ బీ ఫామ్ పొందాలన్న సొంత ఐ. డిలింకు పైన 100 సభ్యత్వాలు చేయాల్సిందే ప్రజలలోకి వెళ్ళండి ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరిని భారతీయ జనతా పార్టీ కుటుంబంలో చేర్చండి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లాలు నాయక్,జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, పోలేపల్లి మాజీ సర్పంచ్ కసోజు బ్రహ్మాచారి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు సముద్రాల నగేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొడ్డటి మధు,ఓబీసీ జిల్లా కార్యదర్శి వెన్నం శేఖర్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ జాహాంగిర్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేళ్ళ శ్రీశైలం యాదవ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్ గౌడ్,రాజు, నిలా కార్తీక్,గంగలి వెంకటయ్య,పాలకూర్ల రాజు,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎస్.ఆర్ కాలనీ సిపిఎం కార్యదర్శిగా ఆశీర్వాదం ఎన్నిక



**తుర్కయంజాల్, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ :** రాగన్నగూడ పరిధిలోని నీలం సంజీవరెడ్డి నగర్ ( ఎన్ఎస్ఆర్) కాలనీ సిపిఎం పార్టీ ఆరవ శాఖ మహాసభలు బుధవారం నిర్వహించడం జరిగింది. నూతన శాఖ కార్యదర్శిగా జంగిలి ఆశీర్వాదం సభ్యులుగా కొండిగారి శంకర్ నిమ్మ లక్ష్మయ్య, నక్మల్ల యాదగిరి, ఎం చిన్న లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య మాట్లాడుతూ పార్టీ ఆశయాలను లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కమిటీ పని చేయాలని ప్రధానంగా స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద ఎప్పటికప్పుడు స్పందించి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని అన్నారు. తుర్కయంజాల్ ప్రాంతంలో భూముల రేట్లు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాంతంలో ఉన్న రాజకీయ పార్టీ నాయకులు అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ భూములను ఎఫ్టిఎల్ బఫర్ జోన్ ఆయా కాలనీలో ఉన్నటువంటి పార్కు స్థలాలను కూడా కబ్జా చేస్తున్నారని ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం జరుగుతున్న రెవెన్యూ అధికారులు మున్సిపల్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలందరికీ పింఛన్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులైన వారికి పకడ్బందీగా అమలు అయ్యే విధంగా చూడాలని అన్నారు. లేని పక్షంలో ప్రజల తరఫున సిపిఎం పార్టీ అండగా నిలబడి పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మున్సిపల్ బాధ్యులు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి కిషన్, నాయకులు ఏం సత్యనారాయణ, కే .శారద, కొండగారి శంకర్, నక్మల్ల యాదగిరి, నిమ్మ లక్ష్మయ్య, ఏం చిన్న, కె వెంకట కృష్ణ, పి.శ్రీను, డి .శ్రీధర్ కుమార్, అశోక్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




# పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్

## శ్రీ శివ సాయి కాటన్ జిన్నింగ్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలు నాయక్





**చింతపల్లి, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** చింతపల్లి మండల కేంద్రంలోని శ్రీ శివ సాయి కాటన్ జిన్నింగ్ మిల్ లో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్నలకు సైతం 500 రూపాయల బోనస్ గా ఇస్తుందని అన్నారు. కనీసం మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేయాలని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రం చెయ్యని విధంగా మూడు దఫాలుగా రైతులకు సుమారు లక్ష రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు.రైతు రుణమాఫీ కానీ వారు ఎవరు అధైర్య పడవద్దని టెక్నికల్ ఇబ్బంది ఉన్న వారిని వ్యవసాయ శాఖ మంత్రి సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ అయ్యే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు.రుణమాఫీ కానీ వారికి కూడా త్వరలో వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చామని గుర్తు చేశారు.ప్రతిపక్షాలు అవాక్కులు చేవాక్కులు పేలుతూ రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని రాష్ట్ర ప్రజానికం చూస్తున్నారన్నారు. ప్రజలు రెండు సార్లు కర్రు కాల్చి వాత పెట్టినా కూడా బుద్ధి లేకుండా ఫామ్ హౌస్ లో కూర్చొని రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతన్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఫామ్ హౌస్ లో కూర్చొని విమర్శలు చేస్తూ సోషల్ మీడియా వేదికల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు ప్రజా ప్రభుత్వం లో సిఎం రేవంత్ రెడ్డి , మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎల్లప్పుడూ అందుబాటు ఉంటూ ప్రజా సమస్యల మీద సమయం కల్పిస్తూ వాటిని పరిష్కరిస్తున్న వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి గారని అన్నారు.ప్రజల కోసమే ప్రజల వద్దకు ప్రజాపాలన తీసుకువచ్చిన ఒక గొప్ప వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి గారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి,దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం,మాజి ఎంపీపీ భవాని పవన్ కుమార్,మాజి జెడ్పిటిసి హరి నాయక్,మాజి సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి, డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, పీ ఎస్ సి ఎస్ చైర్మన్ వెంకటయ్య, మార్కెట్ కమిటీ సభ్యులు,మండల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగం నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ

గురువారం 17 అక్టోబర్ - 2024

## మునుగోడు మండలం కేంద్రంలో బట్టకాలువ లో బి.జె.పి. సభ్యత్వం నమోదు-మాదగోని నరేందర్ గౌడ్





**చండూర్ అక్టోబర్ 16 (శాసనసభ న్యూస్) :** మునుగోడు మండల కేంద్రంలోని బట్టకాలువ లో బిజెపి సభ్యత్వం నమోదు కార్యక్రమం మునుగోడుమండల పార్టీ అధ్యక్షులు పెంబళ్ల జానయ్య గారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ ఉపాధ్యక్షులు కర్నాటి శేఖర్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నెల్లికంటి రమేష్ యదవ్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి ఓడిగా స్వామి,దళిత మోర్చా మండల ప్రధాన కార్యదర్శి పేరుమాండ్ల రాము పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

### చింతపల్లి మండల కన్వీనర్ గా గాదరి జంగయ్య





**చింతపల్లి, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చింతపల్లి మండల కన్వీనర్ గా గాదరి జంగయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ గోలి సైదులు, కో చైర్మన్ విజయ్ కుమార్, రేఖల సైదులు, తెలుగు మల్ల యాదగిరి, మేకల కృష్ణయ్య, తెలంగాణ మాల మహానాడు వ్యవస్థాపక సభ్యులు నల్లవెల్లి సంజీవ, అధ్యక్షన కార్యక్రమం జరిగింది. మండల కో కన్వీనర్ గా గంటల ఆంజనేయులు, నిమ్మ వీరయ్య,ఆవుల సురేష్,నాగటి వెంకటేష్, భూత మల్లేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అమరవీరుల ఆశయ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ కోరే సాయిరాం పూర్తి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండి లక్ష్మీకాంత్, తదితర దళిత రత్నాలు పాల్గొనడం జరిగింది.

## సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కు అందజేత



**యాచారం, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డి, యాచారం మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన సిఎంఆర్ఎఫ్ చెక్కును ఇటీవల కొన్ని నెలల క్రితం ఆసుపత్రిలో చికిత్స పొందిన యాచారం మండలం ,నందివనపర్తి గ్రామానికి చెందిన ఎం. శివ ప్రసాద్ కు 60,000/- రూ. చెక్కును పొలమోని రామకృష్ణ యాదవ్ బాదితునికి అందించారు. ఈ కార్యక్రమంలో నంది వనపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు నర్రే శ్రీశైలం , ఎస్సీ సెల్ అధ్యక్షులు ముచ్చర్ల యాదగిరి, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రశాంత్, పార్టీ యువకులతో కలిసి పోలమోని రామకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు .

## కామ్రేడ్ ఎర్ర రవి ఆశయ సాధన కోసం పోరాడుదాం

### ముదిగొండ మురళి కృష్ణ.





**చింతపల్లి, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర రవి 10వ వర్ధంతి సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని ఆయన స్థూపానికి విద్యార్థి నాయకులు, కుటుంబ సభ్యులు, పార్టీతో నిమిత్తం లేకుండా నాయకులు పూలమాల వేసి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ ఎర్ర రవి విద్యార్థుల హక్కుల కోసం, మండల కేంద్రంలో జూనియర్ కళాశాల సాధన కోసం ఉద్యమాలు చేశారని, ప్రభుత్వ హాస్టల్స్, పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించారని,అలాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిర్వహించిన పోరాటంలో చురుకుగా పాల్గొన్నాడని ఆయన సేవలను కొనియాడారు. కామ్రేడ్ ఎర్ర రవి లేని లోటు ఏఐఎస్ఎఫ్ సంఘానికి, విద్యార్థి లోకానికి, పేద ప్రజలకు తీరని లోటు అని, ఆయన ఆశయాల కోసం మరిన్ని ఉద్యమాలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తామని అన్నారు. విద్యార్థులు తమ హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని,విద్యా రంగానికి అధిక నిధులు కేటాయించి, అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ లు, ఫీజు రియంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్ర చిన్న,నల్ల సతీష్,అశోక్,మనోహర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్





**దేవరకొండ అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** గుడిపల్లి మండలంలోని చిల్కమర్రి గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ తిరుమల కాటన్ జిన్నింగ్ మిల్ వద్ద దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్లిప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే రైతు భరోసా 7500 రూపాయలు ఇస్తామన్నారు. ఈ నెలాఖరులోగా రూ 2 లక్షల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. వచ్చే నెల నుంచి రూ. 2 లక్షల పైబడి ఉన్నవారికి మాఫీ చేస్తామని పేర్కొన్నారు. మరో వైపు టీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రం చెయ్యని విధంగా మూడు దఫాలుగా రైతులకు సుమారు లక్ష రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుంది,ప్రతిపక్షాలు అవాక్కులు చేవాక్కులు పేలుతూ రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు దీనిని రాష్ట్ర ప్రజానికం చూస్తున్నారు ప్రజలు రెండు సార్లు కర్రు కాల్చి వాత పెట్టిన కూడా బుద్ధి లేకుండా ఫామ్ హౌస్ లో కూర్చొని రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఫామ్ హౌస్ లో కూర్చొని విమర్శలు చేస్తూ సోషల్ మీడియా వేదికల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు కానీ మన ప్రజా ప్రభుత్వం లో మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎల్లప్పుడూ అందుబాటు ఉంటూ ప్రజా సమస్యల మీద సమయం కల్పిస్తూ వాటిని పరిష్కరిస్తున్న ఏకైక సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కోసమే ప్రజల వద్దకు ప్రజాపాలన తీసుకువచ్చిన ఒక గొప్ప వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి గారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య యాదవ్,కృష్ణయ్య, శ్రీధర్ రెడ్డి,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల గోవర్దన్ రెడ్డి %ూాజం% చైర్మన్ జాల నర్సింహా రెడ్డి,డాక్టర్ వేణుధర్ రెడ్డి,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, కసిరెడ్డీ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు,జాల తిలక్ రెడ్డి, సీనియర్ నాయకులు యుగంధర్ రెడ్డి,నారాయణ,వెంకటయ్య , మార్కెట్ కార్యదర్శి యం. కిరణ్ కుమార్,సిసిఐ ఇన్చార్జి యం. శ్రీనివాస్ రావు,యువజన నాయకులు, పలువురు నాయకులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభ

గురువారం 17 అక్టోబర్ - 2024

## ఐదు సంవత్సరాలు పూర్తి అయిన నిర్మాణాంకు

## నోచుకోని బీటి రోడ్డు : కొమ్ము గణేష్



**చండూర్ అక్టోబర్ 16 (శాసనసభ న్యూస్) :** సాంక్షన్ అయి 5 సంవత్సరాలు పూర్తి అయిన కొండాపురం నుండి వయ గొడ్డటిగూడ్డం మీదగా శెరిగూడ్డం రోడ్డు నిర్మాణంకు నోచుకోలేదని సామాజిక ఉద్యమకారుడు కొమ్ము గణేష్ హ్యాఖనించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి, తరువాత నాయకులు మరిచి పోతున్నారని గ్రామ ప్రజలు అన్నారు. కనీసం రవాణా సౌకర్యం లేక రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందని స్కూల్ పిల్లలకు కూడా స్కూల్ కి టైం కి వెళ్ళలేక ఇబ్బందులకు గురవుతున్నారని హ్యాఖ్యనించారు. కావున సంబంధిత అధికారులు ,ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమంలో గొడ్డేటివారి గూడెం ప్రజలు & గొడ్డటి చక్రవర్తి,గునగంటి యాదయ్య, గొడ్డటి పెంటయ్య, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు

## బైండ్ల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎన్నిక

### బైండ్ల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా నాగిళ్ల రాములు



**నాంపల్లి, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** బైండ్ల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు నాగిళ్ల లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం కన్వీనర్ గా నాగిళ్ల శ్రీరాములు, కో కన్వీనర్ ఒగ్గు రాణ ప్రతాప్, గాలెంక విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ నాగిళ్ల శ్రీరాములు మాట్లాడుతూ బైండ్ల కులం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికకు సహకరించిన నాగిళ్ల లక్ష్మణరావు కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల పౌరోహిత్యం,మైసమ్మ మారెమ్మలను మేల్కొల్పటం చేస్తుంటారని,బవనీలను మహారాష్టలో వాజ్య మురళీలు అంటారు.బైనీడుచెప్పే వారిని బవనీలు, బైనీడి వారనీ, బఈండ్ల బైండ్లు, పంబల, జముకు,కొమ్మువారు, ఆసాదులు అనికూడా అంటారు. బైండ్ల వారు మాదిగలకు పూజారులు.కాకతీయ చకరవర్తుల కాలంలో వీర శైవ మతస్థులకు వినోదాన్ని కల్పించేవారని, మాతంగి కొలుపులు చేస్తారని, బైండ్లవారు ఉపయోగించే వాయిద్యం జమిడిక,జిమిలిక, జముకు.సమిడికయే, జముకు.కొన్ని ప్రాంతాలలో దీన్ని పంబ అంటారు కాబట్టి పంబలివాళ్ళుగాకూడా పేర్కొంటారను, కథకుడు మధ్యలో వుండి కథాగానం చేస్తూ వుంటే ప్రక్కన నున్న వంతలు జిమిడికల్ని వాయిస్తూ వుంటారు.ఈ జమిడికలు కొన్ని ఇత్తడితోనూ, మరికొన్ని కర్రతోనూ తయారు చేసుకుంటారు. జమిడిక వాయిద్యం నేటి జముకుల నాదం లాంటిదే. ఝుకఝుం ఝుకఝుం అని నినాదాన్నిస్తాయి.బైండ్ల వారు తెలంగాణాలో ఉత్తరాంధ్రలో జముకులవారు ప్రాముఖ్యం వహిస్తున్నారు. రేణుకా, ఎల్లమ్మ ,గంగాణమ్మ, పోలేరమ్మ, మారెమ్మ,ఎర్ర మారెమ్మ, మహాలక్ష్మమ్మ, మహంకాళమ్మ,మొదలైన గ్రామదేవతలను కొలుస్తారన్నారు. ఆయాదేవతల పుట్టు పూర్వోత్తరాలను కథా గానం చేసే పూజారులున్నారు. మాదిగల ఏకైక కథా రేణుకా ఎల్లమ్మ దేవత కథను చెప్పుకునే విధానమే బైండ్ల కథారూపమన్నారు. ఆరు రాష్ట్రాల్లో బైండ్ల కళారూపాలు సజీవంగా ఉన్నాయని చెప్పారు.బవనీలు చెప్పే ఆరుకథలు రేణుకాయుద్ధం, ఎల్లమ్మకథ,మలిసెట్టి రాయబారం, శక్తికళ్యాణం,మాంధాత కథ, మాత పురాణం ఎల్లమ్మకథాచరిత్ర, మహా కథలను గానం చేస్తూ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిషా ప్రాంతాలలో కూడా తెలుగు బవనీల సంప్రదాయం కొనసాగుతున్నది. బవనీలు ప్రాథమికంగా పూజారులు. ప్రతి పూజలో వినిపించే లయాన్విత ధ్వనే సంగీతం. బైండ్లవారు మోగించే జమిడికె అస్పృశ్యత,అంటరానితనం కారణాలతో వేరేవారెవ్వరు తాకరు.బైండ్ల ప్రదర్శన సాత్వికం కాదు. అది వీరోచితంగా ఉంటుంది. బైండ్ల కళాకారుల్ని మాంత్రికులవలె జనం భావిస్తారు. వారికి మంత్రతంత్ర విద్య తెలుసుననే అపోహ ఉంది.జోగినిలను చేసే పూజారులు బైండ్లవారే. వీరు శాస్త్రోక్తంగా, జానపద కర్మకాండలని జరిపి తంతు పూర్తిచేస్తారని ఆయన అన్నారు బైండ్ల కులస్తుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు పని చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో చిన్నపాక మల్లేష్, చంద్రకంటి దస్తగిరి, నిమ్మకంటి నరసింహ్మ రాములు తదితరులు పాల్గొన్నారు.

## గట్టులక్ష్మి మైసమ్మ అమ్మవారి సేవలో లింగంపల్లి చంద్ర ప్రకాష్ కుటుంబ సభ్యులు

- అమ్మవారికి మొక్కలు చెల్లించి, చిన్ననాటి స్నేహితులతో ఆత్మీయ ఆలింగనం.
- కన్నతల్లిని, ఉన్న ఊరును మరిచిపోలేకనే ఆత్మీయ సమ్మేళనం
- అమ్మవారుదీవిస్తే గ్రామానికి మరింత సేవచేస్తా లింగపల్లి చంద్ర ప్రకాష్.





**చింతపల్లి, అక్టోబర్ 16 శాసనసభ న్యూస్ ప్రతినిధి :** మహిమలు గళ్ల అమ్మ మైసమ్మ, ముత్యం లాంటి మనసున్న అమ్మ ముత్యాలమ్మ అని పెద్దల నానుడి. చింతపల్లి మండల పరిధిలో రాష్ట్ర ప్రధాన రహదారికి సమీపంలో కొలువై ఉన్న గట్టులక్ష్మి మైసమ్మ అమ్మవారు భక్తులు కోరినంతనే కోరికలు నెరవేరుస్తూ కొంగుబంగారమై మొక్కలు తీర్చుతూ ప్రతిరోజు నిత్య పూజలతో చింతపల్లి మండలంలో తన బిడ్డలను ఎల్లవేళలా కాపాడుతూ అలరారుతోంది. ఈ నేపథ్యంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఎల్లవేళలా పాటుపడుతూ తనకు చేతనైన సహాయం చింతపల్లి గ్రామానికి చేస్తూ సోదరీ సోదర భావంతో తన వంతు కృషి చేస్తున్న చింతపల్లి మండల కేంద్రానికి చెందిన లింగంపల్లి చంద్రప్రకాష్, వేణు, కట్టు శ్రీను కుటుంబ సభ్యులు. ఎన్నో సంవత్సరాలుగా గ్రామంలో జరిగే ప్రతి ఉత్సవానికి హాజరై మేము ఉన్నాము అంటూ ప్రతి ఒక్కరితో కలిసి తనసేవలను పాలుపంచుకుంటున్నారు ఈ కుటుంబ సభ్యులు. ఈ నేపథ్యంలో గట్టులక్ష్మీ అమ్మవారికి గతంలో మొక్కిన ముక్కును బుధవారం కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి తనసహచర మిత్రులతో కలిసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు లింగంపల్లి చంద్ర ప్రకాష్. అనంతరం అమ్మవారి సన్నిధిలో గలమినీ ఫంక్షన్ హాల్ లో మిత్రులందరినీ కలిసి ఆత్మీయ ఆలింగనం చేసుకుని గెట్ టుగెదర్ నిర్వహించి మిత్రులకు, కుటుంబ సభ్యులకు ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రప్రకాష్, వేణు, కట్టు శ్రీను మాట్లాడుతూ ఉన్న ఊరు కన్నతల్లిని ఎప్పుడూ జీవితంలో మర్చిపోలేమని ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ఇక్కడే ఉన్నత విద్యను అభ్యసించి ఎవరి వృత్తులలో వారు స్థిరపడ్డామని, అందుకే చింతపల్లి గ్రామంపై మక్కువ ఎక్కువని, ఎక్కడ ఉన్నా చింతపల్లిలో జరిగే ప్రతి ఉత్సవానికి హాజరు కాకపోతే మనసుకు ప్రశాంతత ఉండదని వెల్లడించారు. అమ్మవారి సేవలో పాల్గొన్నవారు మంచి కంటి వెంకన్న, వనం గిరి, మహేష్, వెంకటేష్, వనం మధు, మోర వెంకటరమణ, కంచుకట్ల సాయి, బొడ్డు మహేష్, దాచేపల్లి మధు, గునుకుల రమేష్, ఉప్పల యాదయ్య, ఎర్ర వెంకటయ్య, కడారి సైదులు, కడారి రేవంత్, అక్బర్, రాపర్తి సతీష్, ముచ్చర్ల సైదులు, ముచ్చర్ల శివ, నల్లవెల్లి శంకర్, వందనపు ఆంజనేయులు, చెనమోని హరీష్, చెనమోని మహేష్, సాజిద్, కొప్పరి పరమేష్, గునుకుల రాములు, తాళ్ల సైదులు, కొప్పరి సైదులు, యాచారం ఎల్లయ్య, ఫయూమ్, సోమరాజు ప్రదీప్, గోవింద్ ప్రసాద్, కొప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నామమాత్రంగా పంచాయతీ కార్యదర్శుల పై విచారణ



**చండూరు అక్టోబరు 16 (శాసనసభ న్యూస్) :** చండూరు గ్రామ పంచాయతీకి సంబందించిన రికార్డులు మాయమైన ఘటనపై అధికారులు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన విచారణ నామమాత్రంగా జరిగిందని, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను పూర్తి ఆధారాలతో విచారణకు హాజరు కావాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించగా అనారోగ్యంతో ఒకరు విచారణకు రాక పోగా మిగతా ఇద్దరు ఎలాంటి రికార్డు లు లేకుండానే విచారణకు హాజరైన్నారు. దీనిపై డి ఎల్ పి ఓ కార్యదర్శులను ప్రశ్నినించగా తమకు ముందు పనిచేసిన కార్యదర్శులు తమకు కేవలం బీరువా తాళం చెవి మాత్రమే ఇచ్చారని ఎలాంటి రికార్డులు ఇవ్వలేదని చెప్పటంతో అధికారులు విస్తూపోయారు. కార్యదర్శులు లిఖిత పూర్వకంగా ఇచ్చిన వివరాలతో జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

## పాల్వాయి శ్రవణ్ రెడ్డి కుమార్తెను కిడ్నాప్ చేశారంటూ ధర్నా



**చండూరు అక్టోబర్ 16 ( శాసనసభ న్యూస్ ) :** చండూర్ చౌరస్తాలో మంగళవారం రాత్రి పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కుమారుడు శ్రవణ్ రెడ్డి తన భార్య తో గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు.శ్రవణ్ రెడ్డి పాపను తన చెల్లి పాల్వాయి స్రవంతి రెడ్డి కిడ్నాప్ చేశారని ఆరోపించారు. సెప్టెంబర్ 11న మా పాపను కిడ్నాప్ చేసారని,12తేదీన పోలీసులకు పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదంటూ ఆరోపణ చేశారు. మా పాపని మాకు అప్పగించాలాంటూ డిమాండ్ చేశారు.పోలీసులు చైల్డ్ వెల్ఫేర్ సంరక్షణలో ఉందని చెప్పినప్పటికీ మా పాపను కిడ్నాప్ ఎవరు చేసారో తేల్చాలంటు డిమాండ్ చేశారు.